# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 191 | విశాఖపట్నం | 12-4-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 191 | VISAKHAPATNAM | 12-4-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-






Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




3లో

ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద కారుపై బోల్తాపడిన లారీ..

## ముగ్గురు దుర్మరణం!



6లో

## నేలరాలిన మామిడి..

### లబోదిబోమంటున్న రైతులు



6లో

## రోజంతా అలసటగా అనిపిస్తుందా?

### మహిళలు, బాలికలపై దాడులు చేస్తే

# చర్యలు: చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** కడప జిల్లాలో జరిగిన దారుణ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలపై దాడులకు తెగబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి విషయాల్లో నిందితులను ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించరాదన్నారు. ఖాజీపేట ప్రాంతంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్య ఘటనపై సీఎం సీరియస్ అయ్యారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆడబిడ్డల భద్రత విషయం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. కడప జిల్లా ఖాజీపేటలో రామకీర్తనను(17) వెంకటేశ్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. కొంత కాలంగా ప్రేమించాలంటూ బాలికను వేధింపులకు గురిచేశాడు వెంకటేష్. అందుకు బాలిక నిరాకరించడంతో కోపంతో ఊగిపోయిన ప్రేమోన్మాది.. నిన్న(శుక్రవారం) బాలిక ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఆమె ఒంటిరిగా ఉంది. దీంతో తనను ప్రేమించాలని బలవంతం చేశాడు వెంకటేశ్. అందుకు కీర్తన నిరాకరించడంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో బాలిక గొంతు కోశాడు ఉన్మాది. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చి చూడగా కూతురు రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో బాలిక చనిపోయింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

### గాజువాకలో దగ్ధమైన

## మినీ బస్సు



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక ఆటోనగర్‌లో ఓ మినీ బస్సులో మంటలు చెలరేగాయి. వినీత టూర్స్ & ట్రావెల్స్ బస్సును షోరూమ్‌కు తీసుకెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ దిగిపోయాడు. మంటల్లో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఘటనాస్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. షార్ట్‌సర్క్యూట్ వల్లే మంటలు వచ్చినట్లు తెలుస్తోంది.

### పార్లమెంటు ప్రాంగణంలో

## రాహుల్‌తో ముచ్చటించిన మోడీ



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారంనాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించుకున్నారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు.

### చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు

## నమ్మకం పెరిగింది: అనిత



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** చట్టాలు, న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగిందని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. పబ్లిక్ ప్రాసిక్యూషన్ అంటే ఒక గౌరవమని ఉద్ఘాటించారు. పోక్సో కేసుల్లో బెయిల్ రాకుండానే శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థ, న్యాయ వ్యవస్థ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ప్రాసిక్యూషన్ విభాగం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, బానిస కార్మిక వ్యవస్థ (రద్దు) చట్టం, 1976పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ రామకోటేశ్వరరావు, 200 మంది ప్రాసిక్యూషన్ అధికారులు పాల్గొన్నారు. వివిధ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను సత్కరించారు. అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. సమాజానికి ఉపయోగపడేది ఈ వర్క్‌షాప్ అని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా 900 మంది పిల్లలను రక్షించామని వివరించారు.

## సింగర్ మంగ్లీపై క్రిమినల్ కేసు..



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలుగు రాష్ట్రాల్లో తన జానపద, సినీ గీతాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ గాయని మంగ్లీ తీవ్రమైన ఆరోపణలతో చిక్కుల్లో పడ్డారు. పెట్టుబడుల పేరుతో మోసం చేయడమే కాకుండా బాధితుల తరపున ప్రశ్నించిన న్యాయవాదిని చంపేస్తామని బెదిరించారనే ఆరోపణలపై పంజాగుట్ట పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మంగ్లీతో పాటు ఆమె సోదరుడు శివ, 'విరాటపర్వం' ఫేమ్ డైరెక్టర్ వేణు ఉడుగుల పేర్లు కూడా ఉండటం సినీ వర్గాల్లో కలకలం రేపుతోంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. మంగ్లీ, ఆమె సోదరుడు శివ మరికొంతమందితో కలిసి ఒక బృందంగా ఏర్పడ్డారు. వ్యాపారాల్లో పెట్టుబడులు పెడితే అతి



2లో

## తవ్వేస్తారు.. వదిలేస్తారు

- అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- నెలల తరబడి కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్న విద్యుత్ శాఖ

### 20న ఘనంగా అప్పన్న

## చందనోత్సవం: ఆనం



**అమరావతి, పతాకం న్యూస్:** ప్రభుత్వ నియమాల ప్రకారం సింహాద్రి అప్పన్న చందనోత్సవం ఈ నెల 20న ఘనంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం తెలిపారు. తొలుత పూసపాటి వంశస్థులు అప్పన్నను దర్శించుకుంటారన్నారు. భక్తులు స్లాట్‌ల ప్రకారమే దర్శనాలకు రావాలని సూచించారు. అప్పటికప్పుడు వచ్చే భక్తులకు కొన్ని ఇబ్బందులు రావచ్చన్నారు. ఒకేసారి 25 వేల మంది దర్శనం చేసుకునేలా 5 క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈసారి దర్శన టికెట్లు, వాహనాల పాస్‌లపై క్యూఆర్ కోడ్‌లా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిజరూప దర్శన టికెట్లు ఈ నెల 16 నాటికి కలెక్టరేట్‌కు చేరతాయని ఆనం తెలిపారు. ఈసారి 70 శాతం దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో విక్రయిస్తామన్నారు.



పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## మళ్లీ అశాంతి..

నివురు గప్పిన నిప్పులా ఉన్న మణిపూర్‌లో మళ్లీ అశాంతి, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనటం ఆందోళనకరం. గత మంగళవారం బిష్ణుపూర్ జిల్లాలోని అవాంగ్ లైకై గ్రామంలో దుండగులు ఒక ఇంటిపై బాంబు దాడి చేయగా, ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన తల్లి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన గురించి తెలిసిన వెంటనే బిష్ణుపూర్ జిల్లాలో వేలాదిమంది రోడ్ల మీదికి వచ్చి, ఆందోళనలకు దిగారు. చురాచాందపూర్ వైపు వెళుతున్న రెండు ఆయిల్ ట్యాంకర్లకు, ఒక ట్రక్కుకు నిప్పంటించారు. ఎక్కడికక్కడ వాహనాలను నిలిపివేసి, రహదారులను స్తంభింపచేశారు. ఆ రహదారిలోనే ఉన్న సిఆర్‌పిఎఫ్ క్యాంపును వేలాదిమంది చుట్టుముట్టారు. వారిని అదుపు చేసే పేరుతో పోలీసులు జరిపిన కాల్పులు ఇద్దరిని బలిగొన్నాయి. 19 మంది ఆందోళనకారులు గాయపడ్డానికి కారణమయ్యాయి. ఈ సంఘటన తరువాత పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరో నాలుగైదు జిల్లాల్లో జనం భారీఎత్తున రోడ్ల మీదికి వచ్చి, ఆందోళన చేపట్టారు. భద్రతా దళాలు మోహరించి ఉన్నప్పటికీ ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితులను అదుపుచేయటానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ ప్రకటించింది. నిరసనలు చెలరేగిన ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసింది. పోలీసు బలగాలను మోహరించింది. ఒక ఇంటిపై జరిగిన బాంబు దాడి ఇంతటి తీవ్ర నిరసనకు, ఉద్రిక్తతకు దారి తీయటానికి ఆ రాష్ట్రంలోని నెలకొని ఉన్న అభద్ర వాతావరణమే కారణం. మైదాన ప్రాంతంలో నివసించే మైతీయులకు గిరిజన తెగ గుర్తింపు ఇవ్వొచ్చని 2023లో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో కొండలపై నివసించే కుకీ తెగ ప్రజలు కలత చెందారు. తమ హక్కులకు భంగం కలుగుతుందని, తమ భూములకు రక్షణ లేకుండా పోతుందని నిరసనలు తెలిపారు. ఇది మైతీయులకు ఆగ్రహం కలిగించింది. రెండు తెగల మధ్య చాలా కాలంగా ఉన్న విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. కుకీ గ్రామాలపై మూకుమ్మడి దాడులు, దహనకాండ, తరిమివేత, హత్యలు, అత్యాచారాలూ అడ్డూ అదుపూ లేకుండా సాగాయి. అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఈ దుర్మార్గ కాండను చూస్తూ ఉండిపోయింది తప్ప- ఆపటానికి ప్రయత్నం చేయలేదు. ఆ ఏడాది మే 3న ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానవీయ సంఘటన ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. మైతీయులు మెజార్టీగా ఉన్న ప్రాంతాల్లో కుకీలను వెంటాడి తరమటం, బాధితులు సహాయం కోరినా ప్రభుత్వం పట్టనట్టు ఉండిపోవటం ... చాలా విమర్శలకు దారి తీసింది. ఈ దుర్మార్గాల గురించి వీడియోలు వెల్లడయ్యాక కానీ, ఆ రాష్ట్రంలో ఏం జరిగిందో బయటి ప్రపంచానికి తెలియలేదు. సభ్య సమాజం నివ్వెరపోయి, ఇది చాలా దారుణమని నిరసిస్తే- ఇవి చాలా సాధారణ సంఘటనలే అన్నట్టుగా అప్పటి బిజెపి ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వ్యాఖ్యానించి, అభాసు పాలయ్యారు. ఇంత జరిగినా ప్రధాని మోడీ వెంటనే స్పందించలేదు. మణిపూర్‌ని సందర్శించలేదు. కుకీలు క్రైస్తవాన్ని అనుసరించటమే బిజెపి పాలకుల పట్టనితనానికి ఒక కారణమనే విమర్శలు వచ్చాయి. ఆ తరువాత కూడా మణిపూర్ మంటలను ఆర్పటానికి, బాధితులకు బాసటగా నిలవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోలేదు. దీంతో, ఆ రెండు తెగల మధ్య నెలకొన్న విభేదాలు సమసిపోలేదు. తరచూ ఏదో ఒక చోట దాడి, ఆస్తి దహనం వంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మత చిచ్చుతో లబ్ధి పొందాలని సంఘ పరివార శక్తులు, కొండ ప్రాంతాల్లోని ఖనిజాలను కొల్లగొట్టాలని కార్పొరేట్ శక్తులూ మణిపూర్ మంటలకు ఆజ్యం పోస్తున్నాయి. మూడేళ్ల క్రితం దాదాపు ఐదు వేల గ్రామాలు ద్వేషాగ్నికి ఆహుతై పోగా, జనం చెల్లాచెదురై పోయారు. ఇళ్లను, ఆస్తులను కోల్పోయిన వేలాదిమంది శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఇంకొందరు రాష్ట్రం విడిచి, వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్ది, శాంతి సామరస్యాలను, సహ జీవన సంస్కృతిని నెలకొల్పాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది. నిర్వాసితులైన వారికి నీడ కల్పించాలి. మనుషుల మధ్య విభజన రేఖలు గీసి, విద్వేషాలకు, విధ్వంసాలకు కారణమవుతున్న ఉన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలి. భద్రతా దళాల మోహరింపుతోనే శాంతి చేకూరదు. విద్వేషాలకు కారణమైన పరిస్థితులను చిత్తశుద్ధితో చక్కదిద్దాలి. లేకుంటే మళ్లీ ఏదో ఒక రూపంలో ఉద్రిక్తతలు తలెత్తుతూనే ఉంటాయి.

## టీడీపీ కార్యకర్తల ఆర్థిక బలోపేతం కోసం
# సీఎం చంద్రబాబు కొత్త ప్లాన్



**అమరావతి, పతాకం న్యూస్:** టీడీపీ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణా తరగతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రమం తప్పకుండా హాజరవుతున్నారు. పార్టీ సీనియర్ నేతలతో నేతలు, కార్యకర్తలకు టీడీపీ అధినాయకత్వం శిక్షణ ఇప్పిస్తోంది. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కాఫీ తాగుతూ తన అభిప్రాయాలను సీఎం పంచుకున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్రస్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపైనా నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను... ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని నేతలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి జు3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. 'క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాం... క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నాం... క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం. క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని... పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి... గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ పెరగాలి' అని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు.. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నేతలకు తెలియజేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల కోసం జు3 ప్రొగ్రాం తీసుకొస్తామని చెప్పారు. నీతి, నిజాయితీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్' కార్యక్రమం చేపడతామన్నారు. 'నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచన చేశానో... టీడీపీ కుటుంబం కోసం అదే విధంగా ఆలోచన చేస్తున్నా' అని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

## తవ్వేస్తారు.. వదిలేస్తారు



- అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం
- నెలల తరబడి కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- చోద్యం చూస్తున్నవిద్యుత్ శాఖ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ నగరంలోని అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనుల నిర్వహణ 'మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి' అన్న చందాన తయారైంది. విద్యుత్ వ్యవస్థను సంపూర్ణంగా మార్చడం వల్ల భవిష్యత్ మేలు ఉన్నప్పటికీ నెలల తరబడి ఈ పనుల్లో సాగదీత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సాగర్‌నగర్, ఎండాడ, మధురవాడ తదితర చోట్ల ఏడు నెలల క్రితం మొదలుపెట్టిన అండర్ గ్రౌండ్ కేబుల్ విద్యుత్ వ్యవస్థ పనుల్లో ఈ సా....గదీత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. చాలాచోట్ల 2025 డిసెంబరులో మొదలుపెట్టిన గోతులు తవ్వడం 2026 ఏప్రిల్ వరకూ కొనసాగుతూనే ఉంది. ఎండాడకు వెళ్లేందుకు దారి లేక వాహనదారులు అవస్థలపాలవుతున్నారు. పనులు జరుగుతున్న చోట్ల కాంట్రాక్టరు ఉండటం లేదు. విద్యుత్ శాఖ ఇంజినీరు, సిబ్బంది పరిస్థితీ అదే. నెలల తరబడి జరుగుతున్న పనులపై ఆరా తీయగా తమకేమీ తెలియదంటూ అక్కడ పని చేస్తున్న కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ పనులపై భీమునిపట్నం ఎంఎల్ఏ గంటా శ్రీనివాసరావు ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ పనులన్నీ ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తికావాల్సి ఉంది. ఇదే తంతు కొనసాగితే 2027 డిసెంబరు నాటికి కూడా పనుల పూర్తి ప్రశ్నార్థకమే. శాఖల మధ్య సమన్వయ లోపంఅండర్ గ్రౌండ్ కేబుల్ విద్యుత్ పనుల్లో తీవ్ర తాత్సారం వెనుక అసలు కారణం ఆయా శాఖల మధ్య సమన్వయ లోపమేనని తెలుస్తోంది. నగరంలో సుమారు రూ.350 కోట్ల విలువైన పనులు మధురవాడ ప్రాంతంలో నడుస్తున్నాయి. విద్యుత్ శాఖ, రెవెన్యూ, వాటర్ వర్క్స్, బిఎస్ఎన్ఎల్, జివిఎంసి తదితర శాఖల సమన్వయంతో ఈ పనుల నిర్వహణ జరగాల్సి ఉండగా మధురవాడ ప్రాంతంలో జరుగుతున్న పనుల్లో నెలల క్రితం గోతులు తవ్వేసి విద్యుత్ కేబుల్స్ వేశారు. గోతులు కప్పేందుకు నెలల సమయమే పట్టింది. ఆ తరువాత రెండు నెలల క్రితం మళ్లీ తవ్వేశారు. బిఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన ఒప్టికల్ ఫైబర్ కేబుల్ (ఒఎఫ్‌సి) వేయాల్సి ఉండగా ఆ పని పూర్తిచేయకుండా విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు ఆ గోతులు పూడ్చేశారు. బిఎస్ఎన్ఎల్ అభ్యంతరంతో పూడ్చేసిన గోతులను మళ్లీ తీశారు. అలాగే వదిలేశారు. ఒఎఫ్‌సి పైపులు తెచ్చి అందులో వేసాక మరలా విద్యుత్ కేబుల్స్‌ను సరిచూసుకోవాల్సి ఉంటుంది. దీనికి ఎన్ని నెలల తతంగం నడుపుతారో ? అన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. ఇంతలా జనం ఇబ్బంది పడుతున్నా ఎపిఇపిడిసిఎల్ అధికారులకు చీమకుట్టినట్టయినా లేదు. రూ.వందల కోట్ల పనుల్లో నాణ్యతపైనా పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

## హోర్ముజ్ జలసంధిని దాటిన భారత నౌక

**ఇరాన్:** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది.

## బెంగాల్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే శాంతి భద్రతలు: ప్రధాని మోడీ



**పశ్చిమ బెంగాల్, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## మాచర్ల ఏఎస్సై శ్రీనివాసరావు సస్పెన్షన్..



**పల్నాడు, పతాకం న్యూస్:** పోలీసులంటే సమాజానికి రక్షణగా నిలిచే కవచం లాంటి వారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సంఘ విద్రోహ శక్తులను ఎప్పుడూ అడ్డుకుంటుంటారు. ఎలాంటి సందర్భం ఎదురైనా ప్రజలకు తామున్నామంటూ రక్షణగా నిలుస్తుంటారు. అలాంటి పోలీసులే గాడి తప్పితే సమాజం ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తాజాగా అలాంటి పనే చేసిన ఓ పోలీసు.. ఆ వృత్తికే కళంకంగా మారాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చివరికి సస్పెన్షన్‌కు గురయ్యాడు. అతను చేసిన పని చూసి డిపార్ట్మెంట్ మట్మొత్తం ముక్కున వేలేసుకుంటోంది. మాచర్ల ఏఎస్సై శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు పడింది. విద్యార్థినిలు, మహిళలను వేధిస్తుండడంతో ఉన్నతాధికారులు అతనిపై చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలకు వెళ్లే విద్యార్థినిలు, మహిళలను టార్గెట్ చేశాడు ఏఎస్సై శ్రీనివాసరావు. ప్రేమ జంటల వీడియోలు తీసి బెదిరింపులకు దిగేవాడు. అడిగినంత డబ్బు ఇవ్వాలని, ఆపై తన కోరిక తీర్చాలని బెదిరించేవాడు. తాను చెప్పినట్లు వినకపోతే వీడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ హెచ్చరించేవాడు. మాచర్ల మండలానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ కూడా ఏఎస్సైకు సహకరించాడు. వీడియోలు తీసి శ్రీనివాసరావుకు పంపేవాడు. వీరిద్దరూ కలిసి ఈ దందా నిర్వహించేవారు. ఇటీవల స్థానిక వ్యాపారి ఒకరు ఓ మహిళతో వెళ్లారు. వారిద్దరు సన్నిహితంగా ఉన్న వీడియోలను తీసి నగదు వసూలు చేశారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉండడం, అతని ఆగడాలు పెరిగిపోవడంతో పాపం పండింది. ఏఎస్సై వీడియోలు సోషల్ మీడియాలో లీక్ కావడంతో వారి దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయం కాస్తా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో విచారణ చేపట్టి ఏఎస్సై శ్రీనివాసరావును విధుల నుంచి తొలగించారు.

## మీడియా రంగంలోకి విజయసాయిరెడ్డి?

**అమరావతి, పతాకం న్యూస్:** రాజకీయాలకు గుడ్ బై చెప్పిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి త్వరలోనే మీడి యా రంగంలోకి అడుగుపెట్టబోతున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు తన ప్రణా ళికలను వివరిస్తూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కీలక విషయాలు పంచుకున్నారు. రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకుని, జర్నలిజం ద్వారా ప్రజలకు సేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు. మొదటగా తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఒక డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించనున్నట్లు విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ డిజిటల్ వేదిక విజయవంతమైన తర్వాత అదే విలువలు, లక్ష్యాలతో తెలుగులో ఒక శాటిలైట్ న్యూస్ ఛానెల్‌ను కూడా ఏర్పాటు చేస్తామని వివరించారు.

(మొదటిపేజీ తరువాయి)

## సింగర్ మంగ్లీపై క్రిమినల్ కేసు..

తక్కువ కాలంలోనే అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి సుమారు 100 మంది నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అయితే, నెలలు గడుస్తున్నా బాధితులకు ఎలాంటి లాభాలు గానీ, కనీసం అసలు డబ్బు గానీ తిరిగి చెల్లించలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. బాధితుల తరపున రంగంలోకి దిగిన న్యాయవాది సుబ్బారావు, చెల్లించాల్సిన డబ్బుల గురించి మంగ్లీ బృందాన్ని నిలదీశారు. ఈ క్రమంలోనే తనకు తీవ్రమైన బెదిరింపులు ఎదురయ్యాయని ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సింగర్ మంగ్లీ, ఆమె సోదరుడు శివ, దర్శకుడు వేణు ఉడుగుల తనకు ఫోన్ చేసి తీవ్రస్థాయిలో హెచ్చరించారని తెలిపారు. "యాక్సిడెంట్ చేయించి చంపేస్తాం" అంటూ వారు తనను బెదిరించారని, వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాది సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పంజాగుట్ట పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. ఆరోపణలకు బలం చేకూర్చే ఆధారాలు లభించడంతో మంగ్లీ, శివ, వేణు ఉడుగులతో పాటు మరికొందరిపై చీటింగ్, బెదిరింపుల కింద వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వరుస అవకాశాలతో కెరీర్‌లో ఉన్నత స్థాయిలో ఉన్న మంగ్లీపై ఇలాంటి క్రిమినల్ ఆరోపణలు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ కేసులో పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీస్తామని పోలీసులు వెల్లడించారు.

# ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద కారుపై బోల్తాపడిన లారీ.. ముగ్గురు దుర్మరణం!



**ఎన్టీఆర్ జిల్లా, పతాకం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారుపై సిమెంట్ ఫ్లయాస్ లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందినట్లు తెలుస్తోంది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళు ,న్న కారు.. టోల్ కట్టేందుకు ప్లాజా వద్ద ఆగింది. వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి ఆ కారుపై బోల్తాపడింది. ప్రమాదానికి గురైన కారును బీఎండబ్ల్యూ టీఎస్ 6662గా టోల్ సిబ్బంది గుర్తించారు. మరోవైపు జేసీబీలతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# నైట్ ఫుడ్ కోర్టు కార్మికుల భిక్షాటన




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 17 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్న నైట్ ఫుడ్ కోర్టు కార్మికులు భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ పార్క్ వద్ద తిరిగి నైట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేయాలంటూ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు భిక్షాటన చేపట్టారు. పది రోజుల్లో నైట్ ఫుడ్ కోర్టు ఏర్పాటు చేస్తామని జివిఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్ రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఏడు నెలలు కావస్తున్నా నెరవేరలేదన్నారు. ఉపాధి లేక ఆకలితో ఉంటూ, ఇంటి అద్దెలు చెల్లించలేక, పిల్లలను చదివించుకోలేక, వైద్యం చేయించుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సుప్రీం కోర్టు తీర్పును సైతం అధికారులు ధిక్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా తోపుడుబండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అంగుడి సింహాచలం, కె.శ్రీకాంత్, దుంగ శ్రీను, లలిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# జరిమానాల ద్వారా రైల్వేకు రూ.26.21 కోట్లు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** టికెట్ తనిఖీల సమయంలో జరిమానాల ద్వారా వాల్తేరు రైల్వే డివిజన్‌కు గడచిన ఆర్థిక సంవత్సరం (2025-26) రూ.26.21 కోట్ల ఆదాయం సమకూరింది. ఇది గత ఏడాదితో పోల్చితే 3.05 శాతం అధికం. కాగా విజయనగరంలో విధులు నిర్వర్తిస్తున్న టీటీఈ వై.అప్పలరాజు అత్యధికంగా 850 కేసులు నమోదుచేసి రూ.50.2 లక్షలు జరిమానా రూపంలో వసూలుచేసి డివిజన్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా తన కార్యాలయంలో వై.అప్పలరాజుతోపాటు టికెట్ తనిఖీల్లో ప్రతిభచూపిన కె.సంతోషిరావు, సంబిలి, పీవీ త్రివిక్రమరావు, తదితరులకు పతకం, ధ్రువపత్రం అందజేసి, సత్కరించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధత, చిత్తశుద్ధి పాటించి వాల్తేరు డివిజన్ ఆదాయాభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్, ఇతర కమర్షియల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు: ఎస్పీ తుహిన్‌సిన్హా



**అనకాపల్లి, పతాకం న్యూస్:** వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తతోపాటు బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అన్నారు. మైనర్లు సరదా కోసం ద్విచక్ర లేదా ఇతర వాహనాలు నడిపితే ప్రమాదాలబారిన పడే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కఠినమైన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వారికి వాహనాలు ఇవ్వొద్దని ఎస్పీ సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎట్టిపరిస్థితుల్లో రాంగ్‌రూట్‌లో ప్రయాణించవద్దని, మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని ఆయన స్పష్టం చేశారు. సొంత వాహనాల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు ముందుగా టైర్లు, బ్రేకులు, ఇంజన్ కండిషన్‌ను తనిఖీ చేసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు పగటిపూట ప్రయాణంచేసి, రాత్రిపూట విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

# ఎస్సీ, ఎస్టీ ఆవాసాలపై సౌర వెలుగులు



**చోడవరం, పతాకం న్యూస్:** ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద జిల్లాలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు చెందిన ప్రతి ఒక్క ఇంటికీ సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను ఉచితంగా ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. తొలి దశలో 12,750 యూనిట్లు మంజూరుకాగా, సోలార్ ప్యానళ్లను ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తుకు అర్హులైన వారికే ఉచిత సోలార్ యూనిట్లను మంజూరు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ రూఫ్‌టాప్ యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలను జారీచేసింది. ప్రతి ఇంటికి రూ.1.5 లక్షల విలువ చేసే రెండు కిలోవాట్ల సామర్థ్యం వున్న సోలార్ ప్యానళ్లను అమర్చుతారు. అయితే నెలకు 200 యూనిట్లకన్నా తక్కువ విద్యుత్తు వాడుతున్న వారు (ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్యుత్తు పథకానికి) మాత్రమే దీనికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది.

# డంపింగ్ యార్డును వెంటనే తరలించాలి



**గాజువాక, పతాకం న్యూస్:** కాలుష్యంతో కూడుకున్న రామచంద్ర నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.మణి డిమాండ్‌చేశారు. కాలుష్యం నివారించాలని కోరుతూ సిపిఎం గాజువాక జోన్, స్టీల్ జోన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర జివిఎంసి 71, 72 వార్డు పరిధిలోని సుందరయ్య కాలనీ, అరుణోదయ కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, గుడివాడ గురునాధరావు కాలనీ, ఆర్‌టిసి కాలనీ, దిబ్బపాలెం, శ్రీరాంనగర్, కర్ణవానిపాలెం కాలనీల్లో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా మణి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గం పరిధిలో కాలుష్యంతో కూడిన పరిశ్రమలు ఉన్నాయన్నారు. అదాని గంగవరం పోర్టు లాభాలు చూస్తుందే తప్ప ప్రజల ప్రాణాలను చూడటం లేదన్నారు. ఈ పోర్టు విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల గాజువాక ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని, భయంకరమైన వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. కాలుష్యాన్ని అరికట్టి గాజువాక ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం కాలుష్యాన్ని తగ్గించే విధంగా చూడాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, రామ చంద్రనగర్ డంపింగ్ యార్డు వల్ల 16 గ్రామాల ప్రజలు రోగాల భారిన పడుతున్నారన్నారు. దీని దుర్వాసన భరించలేక, సొంత ఇళ్లు విడిచి వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఈ పాదయాత్రలో పిఎస్.కాలనీ శాఖ కార్యదర్శి డి.శ్రీనివాస్, జోన్ కమిటీ సభ్యులు జి.లక్ష్మి, ఎస్.కృష్ణమూర్తి, ఎస్‌వికె.పరశురాం, బి.రమణ, డి.రమణ, గొలగాని అప్పారావు, నాగరాజు, త్రినాథస్వామి, ఎం.శ్రీదేవి, డాక్టర్ రమేష్‌కుమార్, కెపి.కుమార్, ఎ.లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

# గూగుల్ డేటా సెంటర్ కోసం భూములు ఇచ్చిన రైతుల పరిహారం కోసం ఆందోళన వద్దు: గంటా



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** గూగుల్ డేటా సెంటర్ కోసం భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎటువంటి ఆందోళన చెందవద్దని, అపోహలు పెంచుకోవద్దని, ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. ఎంవీపీ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో తర్లువాడ రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. రెండు రోజుల్లో కలెక్టర్‌తో సమావేశమై సానుకూల నిర్ణయం తీసుకంటామన్నారు. భూములు ఇచ్చిన రైతుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాలా సంతృప్తిగా ఉన్నారని, పరిహారం పెంపులోను ఉదారంగా వ్యవహరించారని గుర్తుచేశారు. డీపట్టా భూములకు ఎకరాకు 20 సెంట్ల భూమి, షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం సహా ఆ 520 మందికి మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇస్తామని గంటా పునరుద్ఘాటించారు. సమాచార లోపం కారణంగా రైతులు ఆందోళన చెందిన అక్కడ జరుగుతున్న పనులను ఆపారన్నారు. డీపట్టా మాదిరిగానే జిరాయితీ భూమికి పరిహారం ఇవ్వడం పట్ల బాధిత రైతులు అభ్యంతరం వ్యక్తంచేయగా గంటా వారితో ఏకీభవించారు. వారికి న్యాయం జరిగేలా సీఎంతో మాట్లాడతానన్నారు. రైతులు వ్యక్తంచేసిన అనుమానాలన్నింటిని ఎమ్మెల్యే నివృత్తి చేసి, భరోసా ఇవ్వడంతో వారంతా సంతృప్తి వ్యక్తంచేశారు. వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో కొన్ని దుష్టశక్తులు ప్రవేశించాయని, గూగుల్ డేటా సెంటర్ వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని, ఆరోగ్య సమస్యలు వస్తాయని ప్రచారం చేస్తున్నారని వివరించారు. వారిపై దృష్టిసారించాలన్నారు. మొదటి నుంచి తమకు అండగా ఉంటున్నందుకు ఎమ్మెల్యే గంటాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల తరపున వైసీపీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు మజ్జి వెంకటరావు మాట్లాడుతూ, డేటా సెంటర్ పనులకు సహకరిస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ సంగీత్ మాథుర్, ఏసీపీ అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం



**మల్కాపురం, పతాకం న్యూస్:** పారిశ్రామిక ప్రాంత ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సంఘ సమావేశం మల్కాపురంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. సిహెచ్.అమ్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మల్కాపురం జోన్ నాయకులు కె.నూకరాజు మాట్లాడుతూ, ఎన్ని కార్యక్రమాలు చేసిన ప్రభుత్వం పట్టించుకోవటం లేదని నిరుత్సాహపడకుండా మన కార్యక్రమాలను కొనసాగించవలసిన అవసరం ఉందన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ, రాష్ట్ర మహాసభ జూన్ 30వ తేదీన నెల్లూరు జిల్లాలో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అంతకుముందే అన్ని జిల్లాల మహాసభలు జరపాలని చెప్పారు. విశాఖ జిల్లా మహాసభ మే నెలలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యత్వ రెన్యువల్స్ అందరూ చేయించుకునే విధంగా కృషి చేయాలని కోరారు. షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు వైద్య సదుపాయం, హయ్యర్ పెన్షన్ విషయంలో షిప్‌యార్డు ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం సమర్పించామని, అవకాశం ఉన్నంతవరకు సహాయం చేస్తానని మాట ఇచ్చారని తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్లు పాల్గొన్నారు.

# వ్యాపారుల మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వ్యాపారుల మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ ఎస్.రామానుజస్వామి చెప్పారు. మురళీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించకుండా పలు సంస్థలు, వాపార వర్గాలు ప్రజల నుంచి అక్రమంగా అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయని తెలిపారు. తమ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి వినియోగదారుల హక్కుల కోసం పోరాటం చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఏ వస్తువు కొన్నా బిల్లు తీసుకోకపోవడం వ్యాపారాలకు అనుకూలంగా మారిందన్నారు. బిల్లు ఇవ్వకపోతే ఆయా వ్యాపార సంస్థలు ప్రభుత్వానికి జిఎస్‌టి ఎగ్గొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. పలువురు వినియోగదారులకు న్యాయ సహాయం చేసినట్లు వెల్లడించారు. సేవా రంగంలో మంచి గుర్తింపు పొందిన తమ సంస్థ ఎపి వైస్ చైర్మన్ డాక్టర్ గారా సత్యనారాయణ గోవాలో డాక్టరేట్ తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గారా సత్యనారాయణ, సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ మార్టిన్ ఫేరీరా, సౌత్ ఇండియన్ వైస్ చైర్మన్ డాక్టర్ రజనీకాంత్, సౌత్ ఇండియా ఆర్గనైజేషన్ సెక్రటరీ డి.దేముడు, అనకాపల్లి జిల్లా చైర్మన్ డాక్టర్ శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు స్థల పరిశీలన

**భోగాపురం, పతాకం న్యూస్:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావు జయంతి సందర్భంగా మే 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ఆ పార్టీ నాయకులు భోగాపురం మండలంలో స్థలాలను పరిశీలించారు. ఈ ఏడాది విజయనగరంజిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో మహానాడు నిర్వహించాలని రెండు రోజుల క్రితం జిల్లా ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆ పార్టీ నాయకులు మండలంలోని కోట భోగాపురం, నందిగాం, అమనాం జంక్షన్ సమీపంలో లోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. వీటి తో పాటు డెంకాడ, ఎచ్చెర్ల నియోజకవర్గంలోని రణస్థలం మండలాల్లో కూడా స్థలాలను చూసారు. ఆదినాయకత్వం తో చర్చించి సభ నిర్వహణకు అనువైన స్థలంలో మహానాడు నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తెలిపారు. స్థల పరిశీలనలో ఆయనతో పాటు మ్యారిటన్ బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య , రీజినల్ కోఆర్డినేటర్ పెల్లకూరు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎం సత్యనారాయణ రాజు, వాస్తు సిద్ధాంతి జయరాం రెడ్డి, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగ్గారాజు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, విశాఖ నార్త్ పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ , భోగాపురం మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, నాయకులు గేదెల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులపై వివాదం



**మక్కువ, పతాకం న్యూస్:** మండల కేంద్రమైన మక్కువ ప్రధాన రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో వివాదం చెలరేగింది. అధికారులెవరూ లేకుండానే ప్రైవేట్ వ్యక్తులు మార్కు చేసిన పనులు చేయించడంతో ఈ వివాదం మొదలైంది. స్థానిక ఆటో స్టాండ్ సమీపంలో పనులు జరుగుతుండగా టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు ఎవరి ఆదేశాలతో పనులు జరిపిస్తున్నారని స్థానికంగా ఉన్న టిడిపి శ్రేణులు దాసరి కేశవరావు, పి.మల్లేశ్వరరావును ప్రశ్నించారు. తహశీల్దార్ ఆదేశించారని వారు బకాయిస్తూ స్థానికంగా ఉన్న సిబ్బందిని చూపించారు. దీనిపై తహశీసిల్దారు భరత్‌కుమార్‌ను ప్రశ్నించడంతో తాను ఎవర్నీ ఆదేశించిలేదని తెలపడంతో కొద్దిసేపు పనులను నిలిపివేశారు. ఆటో కార్మికులకు న్యాయం జరిగేలా, అలాగే ప్రజలకు ఉపయోగపడే బస్సు బే ఇతర సౌకర్యాలు ఉండేలా ఎఫ్ లైన్ మేరకు రహదారి విస్తరణ చేపట్టాలని ప్రసాదనాయుడు డిమాండ్ చేశారు. వివాదం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ ప్రసారావునాయుడుతో ఫోన్లో మాట్లాడి గొడవ సద్దుమణిగేలా చూడాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఇరువర్గాలను తన కార్యాలయానికి పిలిచి రహదారి పనుల్లో నెలకొన్న వివాదాన్ని సర్దుమనిగింప చేశారు. ప్రసాదరావునాయుడు తెలిపిన అభిప్రాయం ప్రకారం 80 అడుగుల రహదారిలో కేవలం 30 అడుగుల రహదారితో పాటు పది అడుగులు ఇరువైపులా కాలువలకు కేటాయించడం జరుగుతుందన్నారు. మిగిలిన 20 అడుగులు ఇరువైపులా ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలపడంతో వివాదం సద్దుమణిగింది. తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆటో కార్మికులను కూడా పిలిచి వారికి న్యాయం జరిగేలా చూస్తామని, చిరు వ్యాపాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో టిడిపిలోని ఇరువర్గాలు అక్కడ నుంచి బయటపడ్డాయి. ఏదో ఒక రోజు చెరువు విస్తరణ జరుగుతుంది మండల కేంద్రంలో గల బైరిసాగరం చెరువు ఆక్రమణలతో ఉన్న విషయాన్ని విలేకరులు తహశీల్దార్ భరత్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తహశీల్దార్ స్పందిస్తూ ఇప్పటి రహదారి విస్తరణ మాదిరిగానే ఏదో ఒక రోజు బైరిసాగరం విస్తరణ, ఆక్రమణల తొలగింపు కూడా చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులకు అంతా సహకరించాలన్నారు

## గ్రామ సర్వేయర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



**పార్వతీపురం, పతాకం న్యూస్:** విలేజ్ సర్వేయర్ వ్యవస్థను తీసుకురావడంతో భూ సర్వే రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, నేడు దేశంలోనే 'బెస్ట్ సర్వే డిపార్ట్‌మెంట్'గా మన రాష్ట్రం గుర్తింపు పొందిం దని కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడించారు. స్థానిక పశుపతినాథ స్వామి కళ్యాణ మండపంలో జాతీయ సర్వే దినోత్సవ వేడుకలు సర్వే శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఖ్యలోనూ, సేవలోనూ అగ్రగామి గతంలో కేవలం 1200 మంది ఉన్న సర్వే సిబ్బందిని 12వేలకు పెంచి, ప్రతి గ్రామానికి ఒక సర్వేయర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. గతంలో నెలల తరబడి పెండింగ్‌లో ఉండే సర్వే దరఖాస్తులు నేడు సర్వేయర్లు అందుబాటులో ఉండడంతో త్వరితగ తిన పరిష్కారమవుతున్నాయని, రైతులకు ఇది ఎంతో ఊరటనిస్తోందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామ సర్వేయర్లకు ఉండే సమస్యలు వివరించారని, వాటిపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, సాధ్యసాధ్యాలను బట్టి పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడాకారు లకు సర్టిఫికేట్లను ి అందజేశారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రీసర్వేలో గ్రామ సర్వేయర్లు నిబద్ధతతో పనిచేయడం వల్ల జిల్లా అగ్రగామిగా ఉందని అన్నారు. ఫేజ్-4 లో కూడా 83 గ్రామాలలో 81 గ్రామాల్లో విజయవంతంగా పూర్తి చేశామని అన్నారు. రాబోయే రీ-సర్వే కార్యక్రమాల్లో కూడా ఇదే ఉత్సాహంతో పాల్గొని జిల్లాను మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్దామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఓ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, జిల్లా సర్వే, భూరికార్డుల అధికారి ఎం.శ్రీనివాస రావు, మండల, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిడుగు పడి బాలుడు మృతి



**లక్కవరపుకోట, పతాకం న్యూస్:** ఆకస్మికంగా కురిసిన వర్షం కారణంగా పిడుగు పడి మండలంలోని కల్లేపల్లి రేగ గ్రామానికి చెందిన బడిత బోని చరణ్ (13) మృతి చెందాడు. బాలుడు తండ్రి కనకరాజు తెలిపిన వివరాల ప్రకారం.. 8వ తరగతి చదువుతున్న చరణ్ వంటి పూట బడులు కావడంతో మధ్యాహ్న సమయంలో తన తోటి స్నేహితులతో గ్రామ శివారును ఆడుకుంటున్నాడు. అకస్మాత్తుగా వచ్చిన వర్షం కారణంగా పిడుగు పడి గాయాల పాలు కావడంతో కొత్తవలసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పంచనామా నిమిత్తం చరణ్ మృతదేహాన్ని ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చరణ్‌తో పాటు పిడుగుపాటుకు గాయాల పాలైన స్నేహితులు కోలుకున్నారని తెలిపారు. చరణ్ మృతితో రేగ గ్రామం విషాదం అలముకుంది.

# మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి..రాష్ట్రపతి, ప్రధానినివాళులు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావ్‌పూలే 200వ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ములు నివాళులర్పించారు. శనివారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీతో కలిసి పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణా స్థల్ వద్ద మహాత్మా జ్యోతారావ్ పూలే విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ నివాళి కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, జెపి నడ్డా, మాజీ రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌లు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా 'సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాలకు తన జీవితాన్ని అంకితం చేసిన దార్శనిక సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తున్నాను. ఆయన మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో మార్గదర్శకుడు. అతని కృషి వల్ల, విద్య సాధికారతకు ఒక శక్తివంతమైన సాధనంగా మారింది. ఈ సంవత్సరం మనం ఆయన 200వ జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్నాము. సామాజిక ప్రగతి సాధనలో ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆశిస్తున్నాము' అని మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం తేవాలి



**పాలకొండ, పతాకం న్యూస్:** పీలేరుకు చెందిన న్యాయవాది పూజారి ఎల్లప్పను దుండగులు అతి దారుణంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మునిస్వామి, ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అల్లన శివాదాస్, ఎన్ని ప్రకాష్, మరిచర్ల జగన్మోహనరావు, మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ న్యాయవాదులపై భౌతికదాడులు పెరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన న్యాయం కోసం పోరాడే న్యాయవాదులపై కక్షలు పెంచుకుని హత్యలకు పాల్పడడం దారుణమన్నారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తెచ్చినట్లుగానే ఆంధ్రప్రదేశ్‌లోనూ రాబోయే క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకుని చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉత్తరవల్లి మురళీమెహన రావు, కృష్ణారావు, శామ్యూల్, గాంధీ, కనపక సూర్యప్రకాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గిరిజనుల ఉత్పతులకు మద్దతు ధర కల్పించాలి




**పార్వతీపురం, పతాకం న్యూస్:** మారుమూల గిరిజన ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి వందలాదిమంది గిరిజనులు భారీ ర్యాలీగా ఐటిడిఎకు చేరుకొని ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.రామస్వామి, సహాయ కార్యదర్శి కె.సీతారాం, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడారు. చింతపండు, జీడి పిక్కల మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేశారు. జీడిపిక్కలు కిలో రూ.200కి కొనుగోలు చేయాలని, చింతపండు కిలో వంద రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అటవీ ఉత్పత్తులను జిసిసి కొనుగోలు చేయాలని, దళారీల నుంచి గిరిజన రైతులను కాపాడాలని కోరారు. అకాల వర్షాల కారణంగా జీడి పంట నష్టానికి గురైనందున పంట నష్టానికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల 8 మండలాల్లో 68వేల ఎకరాల్లో జీడి రైతులు పండించే పరిస్థితి ఉందని కాబట్టి ఇప్పటికైనా అకాల వర్షాల నష్టపోయిన జీడి పంటను అధికారులు పరిశీలించాలని కోరారు. గిరిజన గ్రామాల్లో ఉపాధి కూలీలు పని చేసే చోట పేస్ యాప్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని, జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి గిరిజన గ్రామ ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, అన్ని గిరిజన గ్రామాలకు డోలిమోతలు లేకున్నా రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పిఎం జన్మాన్ గృహ నిర్మాణం కింద రూ.5లక్షలు ఇల్లు కట్టుకున్న గిరిజన రైతులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కుక్కిడి పంచాయితీ సర్పంచ్ చామంతి, కోరంగి ప్రకాశరావు, గిరిజన సంఘం నాయకులు హెచ్.బలరాం, ప్రకాశరావు, ఆడిట్ శంకర్రావు, సన్యాసిరావు లక్ష్మణరావు, మధు, రామారావు, బాబురావు, సుందర్ రావు, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

## ఆయుర్వేద కళాశాల నిర్మించాలని ధర్నా

**కాకినాడ, పతాకం న్యూస్:** నగరంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఆయుష్ హాస్పిటల్‌ను తక్షణమే ప్రారంభించాలని, హాస్పిటల్ పక్కనే ఆయుర్వేద కళాశాల నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దువ్వా శేషబాబ్జి, జి.బేబిరాణి, నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరంలో 50 పడకల ఆయుష్ హాస్పిటల్ నిర్మించడం అభినందనీయమన్నారు. ఎంపీ ఉదరు శ్రీనివాస్ కృషి పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నామన్నారు. రూ.కోట్ల ప్రజాధనం వథా కాకుండా తక్షణమే హాస్పిటల్ ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. హాస్పిటల్ పక్కనే ఆయుర్వేద కళాశాల నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయుర్వేద కళాశాల పిఠాపురంలో మంజూరైందని పక్కదోవ పట్టించే ప్రకటనలు ఆపాలన్నారు.

## ఫేస్ యాప్ రద్దు చేయాలంటున్న 'ఉపాధి' కూలీలు



**సీతానగరం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పనుల్లో ప్రవేశపెట్టిన ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల వద్ద తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్.వెంకంపేటలో ఉపాధి పనుల వద్ద కూలీలతో ఆయన మాట్లాడారు. ఫేస్ యాప్ అమలు చేయడం వల్ల కూలీల హాజరు పడకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పనులు చేసిన వారి హాజరు కూడా పడకపోవడంతో పనులు కోల్పోతున్నారని అన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఈ ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయని, వందల మంది హాజరు పడక వ్యవసాయ పనుల్లో కూలీ పనుల్లేక పస్తులు ఉంటున్నారని అన్నారు. వెంటనే ఫేస్ యాప్ రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విబి రాం జీ చట్టాన్ని రద్దుచేసి పాత చట్టాన్ని అమలు చేయాలని, ఏడాదికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజు కూలి రూ.600 ఇవ్వాలని, వేసవి అలవెన్స్ 40శాతం కలిపి ఇవ్వాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, టెంట్లు, మేట్లకు పది రూపాయలు ప్రోత్సాహం, పార, గునపాం, తట్టకు మెంటెనెన్స్‌కు రోజుకు పది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనకై ఈనెల 13న జిల్లాలోని అన్ని మండల కార్యాలయాల వద్ద జరుగు ధర్నా కార్యక్రమంలోఉపాధి కూలీలు,పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, సిహెచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు,

## ఘనంగా పూలే జయంతి వేడుకలు



**కోనసీమ, పతాకం న్యూస్:** మహత్మ జ్యోతిరావు పూలే 1999 జయంతి సందర్భంగా పూలే విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో మామిడికుదురు బాలుర సాంఘిక సంక్షేమ హాస్టల్ వద్ద పూలే విగ్రహానికి పూలమాలల వేసి నివాళి అర్పించారు. విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షులు బొక్కా వీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ... అణగారిన వర్గాల అభ్యున్నతికై, విద్యావ్యాప్తి కి నిరంతరం కృషి చేసిన సామాజిక విప్లవకారుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు నూటికుర్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కన్వీనర్ నయనాల రామకృష్ణ, ప్రచార కార్యదర్శి చిట్టూరి గణేశ్వరరావు, డాక్టర్ నల్లి శ్రీనివాస్, శెట్టిబలిజ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు కాండ్రేగుల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి కడలి నూకరాజు, శెట్టిబలిజ తాలూకా సంఘం ఉపాధ్యక్షులు అప్పారి వెంకటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ పెచ్ ట్టి బాస్కరరావు, జోగి రామకృష్ణ, ఎస్ టి యు నాయకులు కారుపల్లి కళ్యాణ్ బాబు, సానబోయిన నాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు కేశవరావు, బొక్క రవికుమార్, మట్టపర్తి శివకుమార్, యార్లగడ్డ రవి తదితరులు పాల్గొన్నారు.

## చలో నంద్యాలను జయప్రదం చేయండి

**కర్నూలు, పతాకం న్యూస్:** ఈ నెల 17వ తేదీన సిఐటియు 17వ రాష్ట్ర మహాసభ సందర్భంగా నంద్యాలలో జరిగే కార్మిక ప్రదర్శన బహిరంగ సభలో ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి ఆర్ నరసింహులు ఆటో కార్మికులకు పిలుపునిచ్చారు. మహాసభల జయప్రదం కోసం ఆటో యూనియన్ న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నగర ఆటో కార్మికుల విస్తృత స్థాయి జనరల్ బాడీ సమావేశం ఆ యూనియన్ అధ్యక్షులు ఎస్. హుస్సేన్ వలి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి ఆర్. నరసింహులు ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె. ప్రభాకర్, న్యూ సిటీ ఆటో యూనియన్ కార్యదర్శి బి. రాధాకృష్ణ పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను కేవలం ఓటు బ్యాంకుకు మాత్రమే ఉపయోగించుకుంటున్నాయని, అధికారంలోకి రాకముందు అనేక వాగ్దానాలు చేసిన ప్రభుత్వాలు అధికారం అందాక ఉన్న హక్కులను కూడా లాక్కుంటున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం మోటార్ యాక్ట్ సవరణ బిల్లు పేరుతో అధిక జరిమానాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తానేమి తక్కువ కాదన్నట్లు జీవో 21 ద్వారా అధిక చలానా ఫీజులు భారీగా పెంచి ఆటో డ్రైవర్లను దోపిడీకి గురిచేస్తుందన్నారు.

## వందే భారత్ రైళ్లకు వెల్లువెత్తిన ప్రయాణికులు... సికింద్రాబాద్-విశాఖపట్నం రూట్ దక్షిణాదిలో టాప్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రయాణికుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 3.98 కోట్ల మంది ఈ సెమీ హైస్పీడ్ రైళ్లలో ప్రయాణించారు. అంతకుముందు ఏడాదితో (2.97 కోట్లు) పోలిస్తే ఇది 34 శాతం అధికమని రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2019 ఫిబ్రవరిలో న్యూఢిల్లీ-వారణాసి మార్గంలో తొలిసారిగా ప్రారంభమైన వందే భారత్ సేవలు, ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించాయి. ఇప్పటివరకు లక్షకు పైగా ట్రిప్పుల ద్వారా మొత్తం 9.1 కోట్ల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా దేశీయంగా తయారైన ఈ రైళ్ల వేగం, సామర్థ్యం, స్వావలంబనకు ప్రతీకగా నిలుస్తున్నాయని రైల్వే శాఖ పేర్కొంది. దేశంలోని వివిధ మార్గాల్లో న్యూఢిల్లీ-వారణాసి కారిడార్ అత్యంత రద్దీగా ఉంది. ఈ మార్గంలో ఇప్పటివరకు 73 లక్షల మంది ప్రయాణించారు. ఇక న్యూఢిల్లీ-శ్రీ మాతా వైష్ణో దేవి కాట్రా మార్గంలో 56 లక్షల మంది ప్రయాణించడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకానికి ఈ రైళ్లు ఎంతగానో దోహదపడుతున్నాయని స్పష్టమవుతోంది. దక్షిణ భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల మధ్య నడిచే సికింద్రాబాద్-విశాఖపట్నం మార్గంలో 48 లక్షల మంది ప్రయాణించారు. చెన్నై-మైసూరు మార్గంలో 36 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈ రైళ్ల ద్వారా ప్రధాన మత, సాంస్కృతిక, తీరప్రాంత పర్యాటక కేంద్రాలకు కనెక్టివిటీ మెరుగుపడి స్థానిక ఆర్థిక వ్యవస్థలకు ఊతం లభించింది. ఇదే క్రమంలో, సుదూర ప్రయాణికుల కోసం ఈ ఏడాది జనవరిలో ప్రవేశపెట్టిన వందే భారత్ స్లీపర్ సర్వీసులకు కూడా భారీ డిమాండ్ కనిపిస్తోంది. కేవలం మూడు నెలల్లోనే 1.21 లక్షల మంది ఈ సర్వీసుల్లో ప్రయాణించగా, ఆక్యుపెన్సీ రేటు 100 శాతానికి పైగా నమోదు కావడం విశేషం.

## మొక్కజొన్నకు దక్కని.. మద్దతు ధర!



**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందా? లేదా? అని రైతులు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. గతేడాది మొక్కజొన్నకు మంచి ధర పలకడంతో రైతులకు లాభాలను తెచ్చి పెట్ట డంతో ఈ ఏడాదీ అధిక విస్తీర్ణంలో మొక్క జొన్న పంటను సాగు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో కమర్షియల్, సీడ్ మొక్కజొన్న మొత్తం 75 వేల ఎకరాల్లో సాగు చేయగా ఇందులో 29,580 ఎకరాల్లో కమర్షి యల్ మొక్కజొన్న పంటను సాగు చేశారు. చాట్రాయి, ముసునూరు. నూజివీడు, ఆగిరిపల్లి, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం, లింగపాలెం, పెదవేగి, జీలుగుమిల్లి తదితర మండలాల్లో మొక్కజొన్న విస్తారంగా సాగు అయింది. ఈ ఏడాది ఎకరాకు 40 నుంచి 45 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. అయితే దిగుబడులు బాగున్నా సరైన ధర లేక రైతు లు ఆవేదన చెందుతున్నారు. కమర్షియల్ మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటా ల్‌కు రూ.2,400 ఉండగా ప్రస్తుతం వ్యాపారులు రూ.1,700 నుంచి రూ.1,800 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈ ధరకు అమ్మితే ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.35 వేలు వరకు నష్టం వస్తుందని రైతులు, కౌలు రైతు లు గగ్గోలు పెడుతున్నారు. ఎకరాకు సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడులు పెట్టామని కనీస మద్దతు ధర లభిస్తుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు మంత్రి పార్థసారథికి, కలెక్టర్‌కి ఇతర అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. రైతుల విజ్ఞప్తిని సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్లానని, ఆయన స్పందించి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, కేంద్రం నుంచి అనుమతి రాగానే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోళ్లు జరుపుతామని బుధవారం రాత్రి చాట్రాయి మండలం బూరుగుగూడెంలో మంత్రి సారథి రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు అందించకపోతే దారుణంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

## 20, 21 తేదీల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు

**కృష్ణా, పతాకం న్యూస్:** నారా లోకేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు శనివారం తెలిపారు. నందమూరి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ చైర్మన్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ బస్సు ద్వారా ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మీపురం శివారు రామానగరం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ లో 20వ తేదీన, పురిటిగడ్డ కృష్ణసాయి మందిర కళ్యాణ మండపంలో 21 న ఈ ప్రత్యేక బస్సు ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి ఆహార అలవాట్లు, వ్యవసాయంలో పురుగుమందుల వినియోగం పెరుగుదల, మహిళల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ప్రతి ఒక్కరూ ముఖ్యంగా మహిళలు, వ్యవసాయ కార్మికులు, క్యాన్సర్ అనుమానం ఉన్న వారు ప్రతి ఒక్కరూ ఈ స్క్రీనింగ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యార్లగడ్డ శ్రీనివాసరావు కోరారు.

# విశాఖలోని కంపెనీల ఒప్పందాల్లో సవరణలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం జిల్లా పరిశ్రమలకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఈ సమావేశంలో ఐటీ కంపెనీల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని గతంలో వారితో చేసుకున్న ఒప్పందాల్లో మార్పులు చేశారు. ఆయా కంపెనీలకు కేటాయించిన భూములకు గతంలో 'సేల్ అగ్రిమెంట్' మాత్రమే చేశారు. అంటే వాటిపై కంపెనీలకు హక్కులు ఉండవు. ఇప్పుడు వారికి హక్కులు కలిగేలా ఆయా భూములు పూర్తిగా వారికి దఖలు పడేలా సేల్ అగ్రిమెంట్‌ను 'సేల్ డీడ్'గా మార్చడానికి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ఒప్పందం జరిగినప్పుడు పెట్టిన షరతుల్లో కొన్నింటిని సడలించడానికి కూడా అంగీకారం తెలిపింది.

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కు రుషికొండ ఐటీ పార్కులోని మిలీనియం టవర్‌లో భారీ విస్తీర్ణంలో నిర్మిత స్థలం కేటాయించారు. దానిని సెజ్ నుంచి డీనోటిఫై కూడా చేశారు. అదే కొండపై ఏపీఐఐసీకి చెందిన 21.6 ఎకరాలను ఎకరా కేవలం 99 పైసలకే ఇస్తూ సేల్ అగ్రిమెంట్ చేశారు. ఈ సందర్భంగా కొన్ని షరతులు పెట్టారు. అయితే సేల్ అగ్రిమెంట్ కాకుండా ఆ భూమిపై పూర్తి హక్కులు కలిగేలా సేల్ డీడ్ చేయాలని, షరతుల్లో కొన్నింటిని సవరించాలని కంపెనీ కోరగా, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సిఫారసు మేరకు సరవణకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

ఆరిలోవ జంక్షన్‌లో బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధుకు ఇచ్చిన భూమిలో ఈ ఏడాదిలోనే అకాడమీ, స్పోర్ట్స్ స్కూల్ నిర్మాణం పూర్తి కావలసి ఉంది. ఇంకో ఏడాది గడువు కావాలని కోరడంతో 2027 జూన్ వరకు అనుమతిస్తూ మంత్రివర్గం సిఫారసు చేసింది. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్‌ల ప్రాజెక్టులను ముందుకు తీసుకువెళ్లేందుకు కొన్ని సడలింపులు ఇవ్వాలని అదానీ ఇన్‌ఫ్రా, రైడెన్ ఇన్‌ఫోటెక్ ఇండియా లిమిటెడ్ కోరగా వాటికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వారి భూములకు సేల్ అగ్రిమెంట్‌కు బదులు సేల్ డీడ్, ప్రోత్సాహకాల మార్పు, గతంలో ప్రభుత్వం షరతులతో జారీ చేసిన ఉత్తర్వుల్లో మార్పులు చేయడానికి ఆమోదం తెలిపారు. ఏపీఐఐసీకి, కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్‌కు మధ్య జరిగిన సేల్ అగ్రిమెంట్‌లో కొన్ని నిబంధనల సవరణకు అనుమతించారు. కాన్వెంట్ జంక్షన్‌లో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియాకు చెందిన ఐరన్‌ఓర్ పెల్లెట్ ప్లాంటు విస్తరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అక్కడ ఏడాదికి 7 మిలియన్ టన్నుల పెల్లెట్లు తయారవుతుండగా ఇకపై 11 మిలియన్ టన్నులు తయారు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి ఆ సంస్థ రూ.1,400 కోట్లు పెట్టుబడి పెట్టి, 250 మందికి నేరుగా, 510 మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తామని పేర్కొంది. అయితే ఈ ప్లాంటు విస్తరణ వల్ల నగరంలో కాలుష్యం మరింత పెరుగుతుంది. గాలిలో ధూళికణాల సంఖ్య అధికం అవుతుంది. క్రెడన్స్ రియాల్టీ సంస్థ విశాఖలో ఐటీ పార్క్ ఏర్పాటుకు ముందుకువచ్చింది. రూ.386.88 కోట్ల పెట్టుబడితో 6,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొంది. దాంతో వారి ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ, ప్రోత్సాహకాలు ఇవ్వడానికి అంగీకరించింది. ఫ్యుజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు రెండు ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అందులో రూ.425 కోట్ల పెట్టుబడితో 2,500 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఆ సంస్థ హామీ ఇచ్చింది. కేటాయించిన భూమిలో ఐఓటీ క్యాంపస్ నిర్మిస్తారు. శ్రీటెక్ డేటా లిమిటెడ్ సంస్థ విశాఖపట్నంలో రూ.1,800 కోట్ల పెట్టుబడితో కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుకు ముందుకురాగా వారికి 49 సెంట్ల భూమి కేటాయించారు. ఐటీ, ఐటీఈఎస్ స్పేస్, రిటైల్, రెసిడెన్షియల్, డేటా సెంటర్ల అభివృద్ధికి ఐస్ప్రౌట్ సంస్థకు 9.5 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.626.9 కోట్లతో 12,500 మందికి ఉద్యోగాలు ఇస్తామని ఆ సంస్థ పేర్కొంది.

# జలధార అమల్లో ఆదర్శంగా నిలపాలి



**విజయనగరం, పతాకం న్యూస్:** జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా జలసిరిని పెంచాలని కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాలో భూగర్భ జల మట్టాన్ని గణనీయంగా పెంచడం, గరిష్ట ఉపరితల నీటితో జలవనరులన్నీ కలకలలాడేలా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ వంద రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా పూర్తి చేయడం ద్వారా జిల్లాను ఆదర్శంగా నిలపాలని కోరారు. జలవనరులు, డ్వామా, నీటిపారుదల శాఖల అధికారులు, తాహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టరేట్‌లో సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు చేయాల్సిన విధులను కలెక్టర్ నిర్దేశించారు. జలధార-జలహారతి పనుల ప్రతిపాదనలను వెంటనే సిద్దం చేయాలని చెప్పారు. అంచనా విలువ రూ.10లక్షలు లోపు పనులకు ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, పైబడిన పనులను ఇరిగేషన్ ఏఈలు మంజూరు చేస్తారని చెప్పారు. చెరువులు, సాగునీటి కాలువల్లో పూడిక తీయడం, గట్లను బలోపేతం చేయడం, క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి నీరుపోయే మార్గాలను పునరుద్దరించడం, అడ్డంకులను తొలగించడం, భూగర్భ జల మట్టాన్ని పెంచే కట్టడాల నిర్మాణం తదితర పనులను ప్రతిపాదించాలని సూచించారు. చెరువుల్లోకి నీరు పోయే మార్గాల్లో ఉన్న అడ్డంకులను తొలగించడానికి ఎలాంటి చర్యలకైనా వెనుకాడవద్దని తాహసీల్దార్లను ఆదేశించారు. చివరి ఎకరం వరకు సాగు నీరందేలా, ఉపాధిహామీ పథకం ద్వారా తోటపల్లి కాలువలో వెంటనే పూడికతీత పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్దం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనివల్ల సుమారు 2.5 లక్షల మందికి లబ్దిచేకూరుతుందని చెప్పారు. అలాగే జిల్లాలో ఉన్న 8059 చిన్ననీటి చెరువులతోపాటు, 7,162 పిఆర్ చెరువులన్నిటినీ పూడికతీసి, గట్లను బలోపేతం చేయాలని ఆదేశించారు. ఏప్రిల్‌లోనే 49 లక్షల మేన్‌డేస్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జలధార పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, డ్వామా పీడీ ఎస్.శారదాదేవి, తోటపల్లి ఎస్ఇ స్వర్ణకుమార్, ఇరిగేషన్ ఇఇ వెంకటరమణ, ఆర్‌డిఒ సుధాసాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో వాటన్నింటినీ సరిదిద్ది తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవిన్యూ అధికారులను అదేశించారు. కలెక్టరేట్‌లో క్రవారం సమావేశం నిర్వహించి రీ సర్వే, పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ పై రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. మే లేదా జూన్ నెలలో జిల్లా లో పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనే అవకాశం ఉన్నందున ఈ ప్రక్రియ ను సక్రమంగా పూర్తి చేసి సిద్ధం చేయాలని తెలిపారు. రికార్డు లు సరిదిద్దే అవకాశం ప్రభుత్వం కల్పించినందున తప్పులు సరిదిద్ది రికార్డులు శుద్ధికరణ పూర్తి చేయాలన్నారు. జనవరి నుంచి ఏప్రిల్ 30వరకు గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ జరిగిందని, మే నెలకు 8 గ్రామాలలో, జూన్ నెలలో 30 గ్రామాలలో పాసు పుస్తకాలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. గతంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అవసరమైన మ్యుటేషన్ లు, సబ్ డివిజన్, ఫారం 8 జారీ, జాయింట్ ఎల్‌బిఎం సమస్యలు పరిష్కరించి వాటన్నింటినీ సరిదిద్ది తప్పులు లేని పట్టాదారు పాస్ పుస్తకాల ముద్రణకు పంపించి పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు, ఆర్‌డిఒలు, తహశీల్దార్ లు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పెరుగుదలే లక్ష్యం

**అన్నమయ్య జిల్లా, పతాకం న్యూస్:** జిల్లాలో జలధార ప్రాజెక్ట్ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక సమర్థవంతంగా అమలు కావాలని, భూగర్భ జలాల పెరుగుదలే నిజమైన కొలమానం, లక్ష్యం కావాలని నిశాంత్ కుమార్ సం బంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాలో జలధార ప్రాజెక్ట్ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై జలవనరుల శాఖ, డ్వామా, భూగర్భ జలాలు, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, ఎపిడిలు, ఇంజినీరింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించి, దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో గత సెప్టెంబర్ జలధార కార్యక్రమం చేపట్టక ముందు పరిస్థితులు, చేపట్టిన తర్వాత వచ్చిన తీసుకున్న పనులు, కార్యా చరణ అమలు, ఫలితాలు, దృష్టి సారించాల్సిన అంశాలను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యత, ఉత్సాహం, స్ఫూర్తితో జలధార పనులు, ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చెరువులు ఎందుకు నిండడం లేదో అన్న ప్రశ్నతో ముందుకు వెళ్లాలన్నారు. భూగర్భ జలాలు 6 నుండి 3 మీటర్ల స్థాయికి చేరుకోవడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వయంతో కృషి చేసినప్పుడే అద్భుతమైన ఫలితం వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన జలధార కార్యక్రమం ఒక గేమ్‌ఛేంజర్ అవుతుం దని ముఖ్యమంత్రి స్వయంగా పేర్కొన్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇదొక మోడల్‌గా తీసుకొని అన్నమయ్య ప్లస్ అమలు చేయాలని రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లను ఆదేశించారన్నారు. కేంద్రం సైతం జలధార, జలహారతి కార్యక్రమాన్ని అమలు చేసేం దుకు దృష్టి సారించినందున ఈ వంద రోజుల కార్యాచరణ మరింత బాధ్యతను పెంచిదన్నారు. ఈసారి నార్మల్ రైన్ ఫాల్ మాత్రమే ఉంటుందని, మైనర్ ఇరిగేషన్ ట్యాంక్స్ లలో నీరు నిం పితే భూగర్భ జలాలు పెరిగి జలధార వస్తుందన్నారు. జిల్లాలో 67 ఫీజో మీటర్లు ఉండగా వాటి పనితీరు పరిశీలించాలన్నారు. నరేగా, నీటిపారుదల శాఖల సమన్వయంతో ఉపాధి హామీలో ఫీడర్ చానల్స్, డీసిల్టేషన్, ఫారం పాండ్లు, కందకాలు, ఎమ్ఐ ట్యాంకులు తదితర పనులను మంజూరు చేశామన్నారు. నీటి సహజ ప్రవాహం దారిలో ఆక్రమణలు ఉంటే తొలగిం చాలన్నారు. కాస్కేడ్స్ పరిధిలో బేసిన్, సబ్ బేసిన్, వాటర్ ట్యాంక్స్ ఉంటాయని వాటిని గుర్తించి ఒకదానితో ఒకటి లింక్ చేసే విధంగా పనులు చేయాలన్నారు. జలధార జలహారతి వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.



## మూడు ప్రైవేట్ పాఠశాలల బస్సులు దగ్ధం




**ప్రొద్దుటూరు, పతాకం న్యూస్:** కమలాపురం మండలంలోని కోగటం గ్రామంలో అర్ధరాత్రి వేర్వేరు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రొద్దుటూరు లోని పలు ప్రయివేట్ పాఠశాలలకు చెందిన బస్సులను కోగటం గ్రామంలోని ఓ ఖాళీ ప్రదేశంలో ప్రతి రోజూ నిలిపి ఉంచుతారు. బుధవారం మధ్యాహ్నం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను ఆయా గ్రామాల్లో దింపి వచ్చిన తర్వాత బస్సులను యధావిధిగా కోగటం గ్రామంలో పార్కింగ్ చేశారు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి వేర్వేరు పాఠశాలలకు చెందిన మూడు బస్సులు దగ్ధమయ్యాయి. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను అదుపు చేశారు. ఆకతాయిలెవరైనా బస్సులకు నిప్పు పెట్టారా లేదా షార్ట్‌సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగిందా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పాఠశాలలకు చెందిన యాజమాన్యాల ఫిర్యాదు మేరకు కమలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కార్మికులు పోరాటానికి సిద్ధం కావాలి

**మదనపల్లె, పతాకం న్యూస్:** గ్రామ పంచాయతీ కార్మికులు గ్రామాలలో వెట్టి చేస్తున్నారని, హక్కులను సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరిశర్మ పిలుపునిచ్చారు. పట్టణంలో ఎన్‌జిఒ హోంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అన్నమయ్య జిల్లా రెండవ మహాసభ హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రామయ్య, హరిశర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పంచాయతీ కార్మికులకు నిధులు ఇవ్వకపోవడం దుర్మార్గమ న్నారు. గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులందరికీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే వేతనం ఇవ్వాలన్నారు. పంచాయతీలతో సంబంధం లేకుండా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న తరహాలో రూ.21 వేల వేతనం పంచాయతీ కార్మికులకూ ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**నరసాపురం, పతాకం న్యూస్:** సరిపల్లి గ్రామంలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అధికారులు వివరాలు వెల్లడిస్తూ.. సరిపల్లి రెవెన్యూ గ్రామానికి సంబంధించి ఏప్రిల్ సైకిల్ కింద మొత్తం 627 మంది రైతులకు కొత్త పాసు పుస్తకాలు మంజూరైనట్లు తెలిపారు. నరసాపురం తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వైస్ ఎఎంసి ఛైర్మన్ గంగాధర్, సొసైటీ ఛైర్మన్లు గుబ్బల వీరస్వామి, సంధి నరసింహారావు, అధికారి అనంతరామారావు పాల్గొన్నారు.

## లారీ బీభత్సం.. ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. విద్యుత్‌కు అంతరాయం



**చిత్తూరు, పతాకం న్యూస్:** బైరెడ్డిపల్లి మండల కేంద్రం సమీపంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపన చిలంపల్లి గ్రామంలో. పలమనేరు సమీపాన శరన్ డాబా హోటల్ దగ్గర విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటన చోటుచేసుకుంది. పలమనేర్నుబైరెడ్డిపల్లి జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. రాత్రి సమయంలో కావడంతో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే... తమిళనాడు రాష్ట్రం నుంచి తిరుమల వైపు వెళుతున్న ఓ లారీని డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడం వల్ల రహదారి పక్కన ఉన్న 100కేవీ ట్రాన్స్ఫార్మర్‌ను ఢీకొట్టింది. అదేవిధంగా సేలంపల్లి గ్రామ సమీపాన 25 కెవి ట్రాన్స్ఫార్మర్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ట్రాన్స్ఫార్మర్ తీవ్రంగా దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. దీంతో చిలంపల్లి గ్రామంతోపాటు మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ ఆగకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే అప్రమత్తమైన విద్యుత్ శాఖ సిబ్బంది వెంటనే స్పందించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.


## నేలరాలిన మామిడి..
### లబోదిబోమంటున్న రైతులు



**విజయనగరం, పతాకం న్యూస్:** జిల్లాలో అకాల వర్షాలు మామిడి రైతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వడగళ్ల వర్షాలతో పాటు వీస్తున్న ఈదురుగాలులకు మామిడిపంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల్లో నాలుగు రోజుల క్రితం కురిసిన వడగళ్ల వర్షం, ఈదురుగాలులకు మామిడి కాయలు రాలిపోయి రైతులు నష్టాలకు గురయ్యారు. ఈనెల 6న తెర్లాం, బాడంగి మండలాల్లో గాలివానకు 50 ఎకరాల్లో పంట నష్టం ఏర్పడగా, 7న రామభద్రపురం మండలంలో కురిసిన గాలివానకు 20 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. గురువారం విజయనగరం మండలం పరిధిలో 38 ఎకరాల్లో మామిడిపంట నేలరాలింది. ఈ లెక్కన చూసుకుంటే జిల్లా వ్యాప్తంగా 108 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. పంట చివరి దశలో ఇలా నేలకొరడంతో మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షంతో పాటు వడగళ్ల వాన పడడంతో మామిడి పంటకు తీవ్రనష్టం కలిగిందని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. విజయనగరం మండలంలోని సారిక, గుండాలపేట, కోరుకొండ, కోరుకొండ పాలెం, జొన్నవలస గ్రామాల్లో ఈ ప్రభావం అధికంగా ఉంది.కలెక్టర్, రసాలు, సువర్ణరేఖ రకం మామిడికాయలు ఎక్కువగా నేలరాలిపోయాయి. అంతేకాకుండా వడగళ్ల వర్షంతో కాయలపై మచ్చలు వచ్చి పురుగుబట్టి మూడు నాలుగు రోజుల్లో కాయ రాలిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో 35,539.37 హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది.. ఇప్పటికే జిల్లాలో పూత వచ్చిన సమయంలో నవంబర్‌లో మొంత తుపాను ప్రభావంతో మామిడి పూత ఆలస్యంగా మొదటి దశలో తక్కువగా వచ్చింది. రెండవ దశలో ఎక్కువ పూత వచ్చినప్పటికీ మంచు ప్రభావంతో ఎక్కువ మొత్తంలో మామిడి పూత మాడిపోయింది. దీంతో 80 శాతం రావలసిన కాయ 40శాతానికే పరిమితమైంది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా వడగళ్ల దెబ్బకు మామిడికాయలు రాలిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

# రోజంతా అలసటగా అనిపిస్తుందా?

మన శరీరంలో రక్తం కీలక పాత్ర పోషిస్తుంది. రక్తంలో ఏ చిన్న సమస్య వచ్చినా కూడా అది పెను ప్రమాదంగా మారే అవకాశం ఉంది. శరీరంలో తగినంత రక్తం లేకపోతే దానిని ఎనీమియా అంటారు. మన దేశంలో ఎనీమియా తరచూ చూస్తుంటాం. దీనికి వయసు, జాతి, లింగభేదం అంటూ ఎలాంటి తేడా లేదు. కాకపోతే ఐదేళ్లలోపు పిల్లల్లో, ముఖ్యంగా రెండేళ్లలోపు శిశువుల్లో, రజస్వల ఆరంభమైన అమ్మాయిల్లో, మహిళల్లో, వృద్ధుల్లో ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. కొందరిని పెద్దగా ఇబ్బంది పెట్టకపోవచ్చు గానీ కొందరికి తీవ్రంగా పరిణమించొచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలో రక్తహీనతకు కారణాలు, లక్షణాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!



రక్తంలో ఎర్ర రక్తకణాలు ఉండాల్సిన దాని కన్నా తక్కువగా ఉండటం వల్ల ఎనీమియా తలెత్తుతుందంటున్నారు నిపుణులు. మన శరీరంలో ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ వాయువుల మార్పిడిలో హిమోగ్లోబిన్ అనే ప్రొటీన్ కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఇది ఊపిరితిత్తుల నుంచి ఆక్సిజన్‌ను సంగ్రహించి, రక్తం ద్వారా అవయవాలకు చేరవేస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుతూ, వివిధ భాగాలకు ఎర్ర రక్తకణాలు మోసుకెళ్లుతాయని పేర్కొంటున్నారు. వీటి సంఖ్య తగ్గితే శరీరానికి ఆక్సిజన్‌తో కూడిన రక్తం తగినంత అందదని వివరిస్తున్నారు. ఇది అలసట, బలహీనతకు దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. ఐరన్ లోపంతో తలెత్తే ఎనీమియా మూలంగా పిల్లల్లో విషయగ్రహణ, తెలివి తేటలు, ఎదుగుదల కుంటుపడతాయంటున్నారు నిపుణులు. పెద్దవారిలో పని సామర్థ్యం తగ్గుతుందని చెబుతున్నారు. శైశవంలో, బాల్యంలో ఎనీమియా ప్రభావాలు చాలా అధికంగా ఉంటాయంటున్నారు. గర్భిణుల్లోనైతే గర్భం నిలవకపోవటం, ముందే కాన్పవ్వటం, తక్కువ బరువు బిడ్డలు పుట్టటం వంటి సమస్యలూ ఎదురవుతాయని పేర్కొంటున్నారు. సాధారణంగా ఎనీమియా లక్షణాలు క్రమంగా ముదురుతూ వస్తుంటాయి. సమస్య తీవ్రతను బట్టి ఇవి రకరకాలుగా బయటపడుతుంటాయని నిపుణులు చెబుతున్నారు. నీరసం, నిస్సత్తువ, చర్మం పాలిపోవటం, నాలుక తెల్లగా అవటం, కనురెప్ప లోపలి భాగం తెల్లగా అవటం, నోట్లో పుండ్లు, నాలుక మంట, పెదాల చివర్లు పగలటం, పెదాలు ఉబ్బటం, జుట్టు రాలటం, వెంట్రుకలు కళ తప్పటం, ఏకాగ్రత లోపించటం, చిరాకు, కోపం లాంటి లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనం పేర్కొంది. ఎక్కువగా దాహం వేయటం, చెమటలు పట్టటం, బలహీనత, తల తేలిపోవటం, నాడి వేగంగా కొట్టుకోవటం, శ్వాస వేగంగా తీసుకోవటం.

వ్యాయామం చేస్తున్నప్పుడు పిక్కలు పట్టేయటం, ఆయాసం, మెదడు దెబ్బతినటం, గుండె లయ తప్పటం, గుండె కొట్టుకునేటప్పుడు గొణిగినట్టు చప్పుడు వినిపించటం, గుండె పెద్దగా అవ్వటం, గుండె వైఫల్యం, విచారం, శక్తి సన్నగిల్లటం, తరచూ మూడ్ మారటం. బడికి వెళ్లే వయసు పిల్లలు, మహిళలు, వృద్ధుల్లో తలెత్తే ఎనీమియాకు ప్రధాన కారణం ఇదే. ఆరోగ్యకరమైన రక్తం ఉత్పత్తి కావటానికి హార్మోన్లు, ముఖ్యంగా ఎర్ర కణాల ఉత్పత్తిని పెంచే ఎరిత్రోపాయిటిన్ సమతులంగా ఉండాలని చెబుతున్నారు. అలాగే ఐరన్, విటమిన్ బి12, ఫోలేట్, విటమిన్ సి, కొన్ని ఖనిజాలు, ప్రొటీన్ కూడా అవసరమంటున్నారు. ఇవి తినే ఆహారం నుంచే లభిస్తాయని, అందువల్ల ఇలాంటి పోషకాలతో కూడిన సమతులాహారం తినటం ముఖ్యమని పేర్కొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా 6%-%59 నెలల వయస్సు గల పిల్లలలో 40%, గర్భిణీలలో 37%, 15%-%49 సంవత్సరాల వయస్సు గల మహిళలలో 30% మంది రక్తహీనతతో బాధపడుతున్నారని అధ్యయనం పేర్కొంది. ఎర్ర రక్తకణాలు సగటున 120 రోజుల వరకు జీవిస్తాయని, ఆ తర్వాత చనిపోతాయని నిపుణులు చెబుతున్నారు. కానీ, కొన్నిసార్లు శరీరం వీటిని పరిపక్వం కాకముందే, జీవనకాలానికి ముందే నిర్మూలించొచ్చని అంటున్నారు. ఇందుకు ల్యూపస్ వంటి ఆటోఇమ్యూన్ జబ్బులు, హెపటైటిస్, మలేరియా వంటి ఇన్‌ఫెక్షన్లు, ప్లీహం పెద్దగా అవ్వటం, కొన్నిరకాల మందుల వంటివి కారణం కావొచ్చని తెలియజేస్తున్నారు.

కొందరికి సికిల్‌సెల్, థలసీమియా వంటి జబ్బులతోనూ ఎర్ర కణాలు త్వరగా క్షీణించొచ్చని వెల్లడిస్తున్నారు. గాయాలు, శస్త్రచికిత్సలు, తరచూ ముక్కు నుంచి రక్తం రావటం, అల్సర్లు, పెద్దపేగులో పిలకలు, రుతుస్రావం ఎక్కువగా అవటం, కాన్పు, కొన్ని రకాల క్యాన్సర్లలో రక్తస్రావం అవుతుంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎర్ర కణాల సంఖ్యా తగ్గుతుందని, ఫలితంగా ఐరన్ మోతాదులూ పడిపోతాయని అంటున్నారు. తగినంత ఐరన్ లేకపోతే ఎర్ర కణాల ఉత్పత్తి తగ్గుతుందని, చివరికి రక్తహీనతకు దారితీస్తుందని వివరిస్తున్నారు. పిల్లల్లోనే కాదు, పెద్దవారిలోనూ పేగుల్లో నులి పురుగులు ఉంటాయని, ఇవి రక్తాన్ని పీల్చుకొని జీవిస్తాయంటున్నారు నిపుణులు. ఫలితంగా రక్తం తగ్గిపోయి, ఎనీమియాకు దారితీస్తుందని తెలియజేస్తున్నారు. గాలిలో కలిసే పురుగు మందులు, రసాయనాల వంటి విషతుల్యాలు కొన్నిసార్లు ఎనీమియాకు కారణమవుతాయంటున్నారు నిపుణులు. కొన్ని పదార్థాలు, చలి వాతావరణాలు కూడా ఎనీమియాకు దారితీయొచ్చని, కాబట్టి ఇలాంటి ప్రేరకాలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

# పాకిస్థాన్ చేరుకున్న ఇరాన్ నేతలు.. శాంతి చర్చలకు సర్వం సిద్ధం



**ఇస్లామాబాద్:** అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వైరాన్ని ముగించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కోసం ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాలు పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు చేరుకున్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఖర్ ఖలీబాఫ్ నేతృత్వంలోని బృందం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం ఈ సమావేశంలో పాల్గొననున్నాయి. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత ఇరు దేశాల మధ్య జరుగుతున్న అత్యంత ఉన్నతస్థాయి సమావేశం ఇదే కావడం గమనార్హం. అయితే, ఈ చర్చలు ప్రారంభం కావడానికి ముందే ఇరాన్ కొన్ని కఠినమైన షరతులు విధించింది. తమ డిమాండ్లను అమెరికా అంగీకరిస్తేనే చర్చలు ముందుకు సాగుతాయని స్పష్టం చేసింది. లెబనాన్‌లో హిజ్బుల్లాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని, తమ దేశంపై విధించిన ఆర్థిక ఆంక్షలను ఎత్తివేసి, స్తంభింపజేసిన ఆస్తులను విడుదల చేయాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ఇరాన్ ప్రతినిధి బృందంలో పార్లమెంట్ స్పీకర్‌తో పాటు విదేశాంగ మంత్రి, రక్షణ మండలి కార్యదర్శి, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ వంటి కీలక అధికారులు ఉన్నారు. మరోవైపు అమెరికా బృందంలో ఉపాధ్యక్షుడు వాన్స్‌తో పాటు ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్ ఉన్నారు. అయితే ఈ చర్చల ద్వారా వెంటనే సానుకూల ఫలితాలు వస్తాయన్న నమ్మకం లేదని వైట్ హౌస్ వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా వివాదాస్పద హర్మూజ్ జలసంధిని త్వరగా తెరుస్తారన్న ఆశలు తక్కువగానే ఉన్నాయని అభిప్రాయపడుతున్నాయి. ఇరు దేశాల డిమాండ్లలో చాలా వ్యత్యాసం ఉంది. ఆంక్షలు పూర్తిగా ఎత్తివేయాలని, హర్మూజ్ జలసంధిపై తమకు అధికారం ఇవ్వాలని ఇరాన్ కోరుతుండగా, యురేనియం నిల్వలు, క్షిపణులను వదులుకోవాలని, తమ పౌరులను విడుదల చేయాలని అమెరికా పట్టుబడుతోంది.

# ఏపీలో చిన్నారులకు డ్రై రేషన్ కార్యక్రమం

## వేసవి సెలవుల్లో పౌష్టికాహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో..



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో వేసవి సెలవుల కారణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిలిచిపోకుండా, కూటమి ప్రభుత్వం 'డ్రై రేషన్' (ఐతీఎ ఞఅశీఅ) పంపిణీకి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నిరుపేద విద్యార్థులు వేసవి సెలవుల్లో పౌష్టికాహారానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఏపీ కూటమి ప్రభుత్వం ఈ వినూత్న నిర్ణయం తీసుకుంది. సాధారణంగా పాఠశాలలు ఉన్నప్పుడు మధ్యాహ్న భోజనం అందుతుంది, కానీ సెలవుల్లోనూ వారి ఇంటికే రేషన్ పంపే డ్రై రేషన్ కార్యక్రమాన్ని తొలిసారిగా ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్రంలోని కరువు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు సెలవుల్లో పౌష్టికాహార లోపానికి గురికాకుండా చూడటమే ఈ పథకం లక్ష్యం. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు, నంద్యాల, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, ప్రకాశం జిల్లాల్లోని 51 కరువు మండలాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎంపిక చేసిన కరువు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 9 తరగతులు పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఈ డ్రై రేషన్ అందజేస్తారు. ప్రాథమిక స్థాయి (1–5 తరగతులు) ఉన్నత పాఠశాల స్థాయి (6–9 తరగతులు) విద్యార్థులకు ఈ డ్రై రేషన్ అందిస్తున్నారు.

ప్రతి విద్యార్థికి సెలవుల కాలానికి సరిపడా కింది వస్తువులను పంపిణీ చేస్తున్నారు:

1. సన్నబియ్యం: ప్రాథమిక పాఠశాల పిల్లలకు 4 కిలోలు, ఉన్నత పాఠశాల పిల్లలకు 6 కిలోలు. 2. కోడిగుడ్లు: ఒక్కో విద్యార్థికి 35 కోడిగుడ్లు. 3. చిక్కీలు (వేరుశనగ అచ్చులు): పోషకాల కోసం 21 చిక్కీలు.

సరుకుల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టింది. విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ లేదా ఐరిస్ ధ్రువీకరణ ద్వారానే సరుకులు అందజేస్తారు. పంపిణీ పూర్తయిన వెంటనే ఆ వివరాలను ప్రభుత్వం కేటాయించిన మొబైల్ యాప్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఎంఈఓలు (వీజూం), పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ ప్రక్రియను నేరుగా పర్యవేక్షిస్తారు. సెలవుల్లోనూ విద్యార్థుల ఆరోగ్యం, పోషణ బాధ్యతను స్వీకరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం వేలమంది విద్యార్థుల కుటుంబాలకు పెద్ద ఊరటనిస్తోంది.




# చెలరేగిన వైభవ్ సూర్యవంశీ..

# రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం



ఈ ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జైత్రయాత్ర సాగిస్తోంది. చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 78) మరోసారి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. ఫలితంగా రాయల్స్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్లతో నెగ్గింది. ఆర్ఆర్‌కిది వరుసగా నాలుగో గెలుపు కాగా.. ఆర్‌సీబీకిది తొలి ఓటమి. ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 81 నాటౌట్) కడదాకా నిలిచి ఆకట్టుకున్నాడు. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (40 బంతుల్లో 63), విరాట్ (16 బంతుల్లో 7 ఫోర్లతో 32), వెంకటేశ్ (15 బంతుల్లో 29 నాటౌట్) రాణించారు. బిష్ణోయ్, ఆర్చర్, బ్రిజేశ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ఛేదనలో రాజస్థాన్ 18 ఓవర్లలో 4 వికెట్లకు 202 పరుగులు చేసి గెలిచింది. జడేజా (24 నాటౌట్) ఫర్వాలేదనిపించాడు. క్రునాల్, హాజెల్‌వుడ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా వైభవ్ నిలిచాడు.

భారీ ఛేదనలో ఓపెనర్ వైభవ్ తుఫాన్ ఆటతీరుకు రాజస్థాన్ స్కోరు రాకెట్‌లా దూసుకెళ్లింది. పవర్‌ప్లేలోనే రాయల్స్ ఏకంగా 97 రన్స్ సాధించింది. ఓపెనర్ జైస్వాల్ (13) రెండో ఓవర్‌లోనే వెనుదిరగ్గా.. అటు హాజెల్‌వుడ్ ఓవర్‌లో వైభవ్ వరుసగా 4,4,4,6తో 19 రన్స్ రాబట్టాడు. భువీని సైతం వదలకుండా 6,6,4 బాదేసిన వైభవ్.. 15 బంతుల్లోనే ఈ సీజన్‌లో తన పేరిటే ఉన్న ఫాస్టెస్ట్ ఫిఫ్టీని సమం చేశాడు. మరో ఎండ్‌లో జురెల్ ఆరో ఓవర్‌లో 4,6,4,6,4తో 24 రన్స్ రాబట్టాడు. ఇక డేవిడ్ ఓవర్‌లోనూ వైభవ్ రెండు సిక్సర్లు బాదగా.. స్పిన్నర్ క్రునాల్ అతడి జోరుకు చెక్ పెట్టాడు. తొమ్మిదో ఓవర్‌లో వరుస బంతుల్లో వైభవ్, హెట్‌మయెర్ (0) వికెట్లు తీయడంతో రాజస్థాన్ నెమ్మదించింది. అయితే రెండో వికెట్‌కు 37 బంతుల్లోనే 108 పరుగుల మెరుపు భాగస్వామ్యం లభించింది. కెప్టెన్ పరాగ్ (3) సైతం నిరాశపర్చాడు. ఆనక జురెల్, జడేజా సింగిల్స్‌పైనే దృష్టి సారించారు. 25 బంతుల్లోనే జురెల్ హాఫ్ సెంచరీని పూర్తి చేసుకోగా.. ఐదో వికెట్‌కు జడేజాతో కలిసి అజేయంగా 68 పరుగులు నమోదు చేసి మ్యాచ్‌ను ముగించాడు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు ఆరంభం పేలవంగా సాగినా.. ముగింపులో మాత్రం అదరగొట్టింది. ఇందుకు కెప్టెన్ రజత్ పటీదార్ ఒంటరి పోరాటమే కారణం. ఆరంభం నుంచే రాజస్థాన్ బౌలర్లు చకచకా వికెట్లు తీస్తూ ప్రత్యర్థిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టారు. దీంతో ఓ దశలో ఆర్‌సీబీ 125/7 స్కోరుతో దీనంగా కనిపించింది. అప్పటికి 14 ఓవర్లు పూర్తికాగా, చేతిలో మూడు వికెట్లే ఉన్నాయి. ఈ స్థితిలో కనీసం నిర్ణీత ఓవర్లయినా ఆడుతుందా? అనిపించింది. కానీ రజత్ టెయిలెండర్లతో చక్కటి భాగస్వామ్యాలు ఏర్పరుస్తూ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. చివర్లో ఇంపాక్ట్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ (29 నాటౌట్) బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 200 దాటింది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ సాల్ట్ (0)ను పేసర్ ఆర్చర్ అవుట్ చేశాడు. అయితే విరాట్, దేవ్‌దత్ ఎడాపెడా షాట్లు ఆడడంతో తొలి మూడు ఓవర్లలోనే 45 పరుగులు సాధించింది. ఓ దశలో 61/3 స్కోరుతో పటిష్ఠంగా కనిపించినా స్వల్ప వ్యవధిలోనే మరో మూడు వికెట్లు కోల్పోయింది. ఇక డెత్ ఓవర్లలో రజత్ భారీ సిక్సర్లతో ఆకట్టుకుని 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. 18వ ఓవర్‌లో అతడిని సందీప్ అవుట్ చేయగా.. వెంకటేశ్ ఆ తర్వాతి రెండు ఓవర్లు నిదానంగా ఆడాడు. కానీ ఆఖరి ఓవర్‌లో మాత్రం 4,6,6తో 21 రన్స్ అందించి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు.

# తండ్రి జైలుకెళ్లిన.. అప్పులు బాధిస్తున్నా.. ఐపీఎల్‌లో రాణిస్తున్న 'ముకుల్ చౌదరి



ఒక్క ఇన్నింగ్స్ చాలు..ఐపీఎల్‌లో హీరోగా మారేందుకు. అలాంటి ఒకే ఒక్క ఇన్నింగ్స్.. గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఆడిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్యాటర్ ముకుల్ చౌదరి పేరు దేశ క్రికెట్‌లో మార్మోగుతోంది. గత వేలంలో రూ. 30 లక్షల ప్రాథమిక ధర ఉన్న ముకుల్‌పై రూ. 2.6 కోట్లు వెచ్చించినప్పుడు అంతా లఖ్‌నవూను ఎగాదిగా చూశారు. అనామక క్రికెటర్‌పై అంత మొత్తమా అని పెదవి విరిచారు. కానీ తనపై పెట్టుకున్న నమ్మకానికి మించిన ఇన్నింగ్స్ ముకుల్ ఆడాడు. ఎందరో వర్ధమాన క్రికెటర్ల మాదిరే 21 ఏళ్ల ముకుల్ కుటుంబం కూడా అనేక కష్టనష్టాలు ఎదుర్కొంది. అందుకే కాబోలు 'ఏ గెలుపూ వెనువెంటనే రాదు. ఈ సంఘర్షణలో ఓ జీవిత కాలం గడిచిపోతుంది. లెక్కకుమిక్కిలి మేఘాలు జతకూడితేనే అది నదిగా మారుతుంద'న్న ఓ కవి వాక్యాలు ముకుల్ తండ్రి దలీప్ చౌదరి వాట్సాప్ స్టేటస్‌లో ఉంటుంది. కొడుకు పుడితే వాణ్ణి క్రికెటర్‌గా తీర్చిదిద్దాలని పెళ్లికి ముందే దలీప్ నిర్ణయించుకున్నారట. ఈ ప్రయత్నంలో ఆయన పడిన బాధలు అన్నీఇన్నీ కావు. రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలోని ఖేదారోకి ధని దలీప్ స్వగ్రామం. ప్రభుత్వోద్యోగం కోసం దలీప్ ఆరేళ్లపాటు పరీక్షలు రాసినా ఫలితం దక్కలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి అడుగుపెడితే అదీ కలిసి రాలేదు. మరోవైపు ముకుల్‌ను క్రికెటర్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అతడిని స్వస్థలానికి 70 కి.మీ. దూరంలోని సికార్ పట్టణంలోని ఎస్‌బీఎస్ క్రిక్‌హబ్‌లో చేర్చారు. ఇందుకోసం దలీప్ తన ఇంటిని అమ్మేశారు. తర్వాత హోటల్ వ్యాపారం మొదలు పెట్టినా అదీ సరిగా నడవలేదు. దీంతో బ్యాంకు కిస్తీలు చెల్లించలేక ఓ దశలో దలీప్ జైలుకు వెళ్లాల్సి వచ్చింది. వాయిదాలు చెల్లించలేకపోవడమే తప్పు..తాను మోసం చేయలేదని దలీప్ చెప్పారు. బంధువులంతా తనను పిచ్చివాడిలా చూశారనీ, తనతోపాటు కొడుకు జీవితాన్నీ నాశనం చేస్తున్నావని కోప్పడినా తాను పట్టించుకోలేదన్నారు. తండ్రి పట్టుదల, బాధలను ఎరిగిన ముకుల్ కూడా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో శ్రమించారు.




## నా ప్రతీ సినిమాతో డిస్ట్రిబ్యూటర్లు హ్యాపీగా ఉండాలి

# 'రాకాస' సక్సెస్ ఈవెంట్‌లో నిహారిక



మెగా ప్రొడ్యూసర్ నిహారిక కొణిదెల నిర్మాతగా మారి తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మించిన 'రాకాస' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సల్‌తో కలిసి ఆమె నిర్మించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమా, విడుదలైన అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించి డిస్ట్రిబ్యూటర్లకు లాభాలు తెచ్చిపెట్టింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని చిత్ర డిస్ట్రిబ్యూటర్లు 'బ్లాక్ బస్టర్ డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు బ్రహ్మాజీ, ప్రముఖ నిర్మాత మైత్రీ రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత నిహారిక కొణిదెల మాట్లాడుతూ తన ఆనందాన్ని పంచుకున్నారు. "రాకాస సినిమాను ఆదరించిన ప్రతీ ఒక్క ప్రేక్షకుడికి వ్యక్తిగతంగా థాంక్స్ చెప్పాలని ఉంది. కానీ అది సాధ్యం కాదు. మా డిస్ట్రిబ్యూటర్లు అందరూ సంతోషంగా ఉన్నారంటే, అదే నాకు నిజమైన విజయం అనిపిస్తోంది. నేను చేసే ప్రతీ సినిమాతో డిస్ట్రిబ్యూటర్లు హ్యాపీగా ఉండేలా చూసుకుంటానని మాటిస్తున్నాను. వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. 'ఉప్పెన' సినిమా సమయం నుంచి మైత్రీ రవి గారితో మంచి పరిచయం ఉంది. ఆయన నాకు ఈ పరిశ్రమలో ఒక గైడ్‌లా మార్గనిర్దేశం చేస్తుంటారు. అలాగే, ఇండస్ట్రీ స్ట్రైక్ సమయంలో అండగా నిలిచిన సుప్రియ అక్క, స్వప్న అక్కలకు ప్రత్యేక ధన్యవాదాలు" అని తెలిపారు. సినిమా గురించి ఆమె ఇంకా మాట్లాడుతూ.. "వేసవిలో కుటుంబమంతా కలిసి చూసి ఎంజాయ్ చేసేలా 'రాకాస' చిత్రాన్ని రూపొందించాం. ఫ్యామిలీ ఆడియెన్స్ నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. నా టీం సపోర్ట్ వల్లే ఈ విజయం సాధ్యమైంది. ప్రమోషన్ల విషయంలో సంగీత్, నయన్, గెటప్ శ్రీను ఇలా ఎవరూ ఎలాంటి కండీషన్స్ పెట్టకుండా పూర్తి సహకారం అందించారు. మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్‌కు రమేష్ గారు పెద్ద పిల్లర్‌గా నిలిచారు. మీడియా కూడా మా సినిమాకు ఎంతో మద్దతు ఇచ్చింది. ప్రేక్షకులకు మరింత చేరువయ్యేందుకు, నేటి నుంచి సింగిల్ స్క్రీన్లలో 'రాకాస' టికెట్ ధరను కేవలం 100 రూపాయలకే అందిస్తున్నాం. దయచేసి అందరూ థియేటర్లలోనే సినిమా చూసి ఎంజాయ్ చేయండి" అని విజ్ఞప్తి చేశారు.

# 'ధురంధర్ 2' చరిత్ర... హిందీలోనే రూ.1000 కోట్లు

బాలీవుడ్ చిత్ర పరిశ్రమ సరికొత్త చరిత్ర సృష్టించింది. స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాన్ని నమోదు చేసింది. కేవలం హిందీ వెర్షన్‌లోనే రూ.1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి భారతీయ చిత్రంగా నిలిచి ఆల్ టైమ్ రికార్డు నెలకొల్పింది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్, విడుదలైన 21 రోజుల్లోనే రూ.1,041 కోట్ల నికర వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం ఇప్పటికే రూ.1,665 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటి దూసుకుపోతోంది. గతంలో 'బాహుబలి 2', 'పుష్ప 2' వంటి పాన్-ఇండియా చిత్రాలు అన్ని భాషల్లో కలిపి భారీ వసూళ్లు సాధించాయి. కానీ, ఒకే భాషలో, అదీ కేవలం హిందీలోనే వెయ్యి కోట్ల నెట్ కలెక్షన్లు సాధించడం 'ధురంధర్ 2'కే సాధ్యమైంది. 2025లో బ్లాక్‌బస్టర్ హిట్టయిన 'ధురంధర్'కు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రంపై ముందు నుంచే భారీ అంచనాలున్నాయి. కథలోని పట్టు, ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాయి. రణ్‌వీర్ సింగ్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ నటన కనబరచగా, సంజయ్ దత్, ఆర్. మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ల నటన సినిమా స్థాయిని మరింత పెంచింది. దీంతో బాలీవుడ్‌లో ఈ చిత్రం ఓ చారిత్రక మైలురాయిగా నిలిచిపోయింది.



## దళపతి ఆఖరి చిత్రానికి పైరసీ సెగ..

# పూజా హెగ్డే ఆవేదన..



తమిళ చిత్రసీమలో తిరుగులేని ఆధిపత్యం చలాయించిన దళపతి విజయ్, రాజకీయ అరంగేట్రం నేపథ్యంలో నటించిన చివరి సినిమా 'జన నాయగన్' అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సెన్సార్ ప్రక్రియలో జాప్యం కారణంగా విడుదల కాలేకపోతున్న ఈ చిత్రం, అనూహ్యంగా ఆన్‌లైన్‌లో లీక్ కావడం కోలీవుడ్‌తో పాటు భారతీయ చిత్ర పరిశ్రమను షాక్‌కు గురిచేసింది.

ఈ దురదృష్టకర పరిణామంపై హీరోయిన్ పూజా హెగ్డే స్పందిస్తూ తీవ్ర ఉద్వేగానికి లోనయింది. వెండితెరపై ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని అందించేందుకు వేలాది మంది టెక్నీషియన్లు పడే కష్టం ఈ ఒక్క లీక్‌తో బూడిదలో పోసిన పన్నీరవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఇది కేవలం ఒక సినిమాకు జరిగిన నష్టం కాదని, కళాకారుల ఆత్మగౌరవంపై జరిగిన దాడి అని ఆమె పేర్కొంది.

మరోవైపు, ఈ పైరసీ ఉదంతం సినీ దిగ్గజాలను ఏకతాటిపైకి తెచ్చింది. రజనీకాంత్, చిరంజీవి, సూర్య వంటి అగ్ర తారలు ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండిస్తూ, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక చిత్రాన్ని ఇలా అగౌరవపరచడం సమంజసం కాదని, అభిమానులందరూ పైరసీని తిరస్కరించి థియేటర్లలోనే సినిమాను చూడాలని వారు పిలుపునిచ్చారు. ఇప్పటికే చిత్ర నిర్మాణ సంస్థ లీకులకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలకు దిగింది. అక్రమంగా క్లిప్పులను ప్రసారం చేసే సోషల్ మీడియా ఖాతాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించింది.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**